క్లుప్తంగా

బండారుని కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

సింహాచలం : రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజాపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు పెనుమత్స శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. సుజాతనగర్‌లో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. బండారుకి మహిళలు అంటే గౌరవం లేదన్నారు. ఒక మహిళా మంత్రిని ఉద్దేశించి ఆయన మాట్లాడిన తీరు క్షమించరానిదన్నారు. బండారు ఇంట్లో కూడా మహిళలు ఉన్నారన్న విషయం గుర్తించుకోవాలన్నారు. ఇటువంటి వ్యక్తులపై ప్రభుత్వం, న్యాయస్థానాలు కఠినంగా వ్యవహరిస్తేనే మహిళలకు రక్షణ, మర్యాద ఉంటుందన్నారు. వెంటనే సత్యనారాయణ మూర్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం : జీవీఎంసీ 95వ వార్డు 499వ నంబరు సచివాలయం పరిధిలోని శ్రామికనగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు గురువారం పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ఈ సమస్య పరిష్కారం కోసం రూ.6 లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టు, డ్రైనేజీ పనులకు ఇటీవల శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పనుల్లో నాణ్యతను కార్పొరేటర్ దేముడు పరిశీలించి కాంట్రాక్టర్‌కి పలు సూచనలు అందజేశారు. నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు అంగటి సూరిబాబు, ఆకుల గుణాకర్, గంట్ల నరసింహమూర్తి, పువ్వాడ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్


అదీప్‌రాజ్‌కి స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఏఈఓ భ్రమరాంబ

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు చేసి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు. ముత్యాలమ్మపాలెంలో తలపెట్టిన మా భవిష్యత్తు సంక్షేమ యాత్ర విజయవంతం కావాలని అప్పన్నస్వామిని దర్శించుకున్నట్టు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. వైఎస్సార్‌సీపీ 93వవార్డు నాయకుడు వినోద్, తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి


ఆటోడ్రైవర్లుకి సూచనలు అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్

సింహాచలం: ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక కల్యాణ మండపంలో గురువారం పెందుర్తి జంక్షన్, చినముషిడివాడ, సుజాతనగర్ ఏరియాల్లోని ఆటోస్టాండ్ యూనియన్ అధ్యక్షులు, ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎక్కడికక్కడ ఆటోలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా మద్యం సేవించి ఆటో నడపడం, పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడితే ఆటోలను సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

- పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి
- పెదగాడిలో 450 మందికి వైద్య పరీక్షలు


మెట్టపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో నాయకులు, వైద్య సిబ్బంది


పెదగాడిలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి


శిబిరంలో పరీక్షల కోసం తరలివచ్చిన ప్రజలు

సింహాచలం : ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఇళ్ల వద్దే నాణ్యమైన వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి అన్నారు. పెందుర్తి మండలం పెదగాడిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన నాగమణి మాట్లాడుతూ విద్య, వైద్య, వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి జగన్ అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఒకవైపు రాష్ట్రాభివృద్ధి, మరో పక్క ప్రజల సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకుని పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, వారికి మెరుగైన వైద్యం అందించాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో 450 మందికి వైద్య సేవలందించారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నక్క కనకరాజు, సర్పంచ్ కె.లావణ్య, త్రినాథ్, ఎంపీటీసీ సభ్యుడు అప్పలరాజు, ఉప సర్పంచ్ వెంకటసూరి, ఈవోపీఆర్‌డీ అప్పారావు, కార్యదర్శి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

పరవాడ: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఓ వరంలాంటిదని పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి అన్నారు. నాయుడుపాలెం శివారు మెట్టపాలెం జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజుతో కలిసి ఆమె గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న ధ్యేయంతో ముందడుగు వేస్తున్నారని కొనియాడారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ప్రత్యేక వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తుండడం సంతోషకరమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో ప్రజలకు వాడచీపురుపల్లి ప్రభుత్వ వైద్యులు కనకప్పారావు, క్రాంతి కుమార్, సిబ్బంది సేవలు అందించారు. సబ్బవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పైల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి, సీతారామయ్య, కో ఆప్షన్ సభ్యులు ఎం.అప్పన్న, పార్టీ నాయకులు చల్లా కనకారావు, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి పంచాయతీ కార్యదర్శులు రమేష్, మురళీధర్ పట్నాయక్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నేస్తాలమ్మ పండగ


భక్తులకు దర్శనమిస్తున్న నేస్తాలమ్మ అమ్మవారు

పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం నేస్తాలమ్మ అమ్మవారి పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. పండగను పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నేస్తాలమ్మను వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామ పెద్దలు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి దర్శనం కోసం వేకువజాము నుంచి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వాడచీపురుపల్లి సతకంపట్టు నుంచి నేస్తాలమ్మను డప్పులు, చిడతలు, భజనలు, కోలాటాలు, కోయ డ్యాన్సులు, తప్పెటగుళ్ల మధ్య గ్రామ పురవీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. రాత్రికి అమ్మవారి అనుపోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- నగరంలో 15 కూడళ్ల గుర్తింపు
- డీసీపీ – 1 శ్రీనివాసరావు

సీతమ్మధార: నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ-1 శ్రీనివాసరావు తెలిపారు. ఫోర్త్‌టౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్లను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మహా విశాఖలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని 15 ప్రధాన కూడళ్లు మద్దిలపాలెం, హనుమంతువాక, సిరిపురం, గాజువాక, ఎన్ఏడీ, గోపాలపట్నం, కొమ్మాది, గురుద్వారా, పెందుర్తితోపాటు పలు ప్రాంతాలను గుర్తించామన్నారు. ఉన్నత స్థాయి అధికారులతో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ రెగ్యులేషన్ కోసం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు 15 జంక్షన్ల వద్ద ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్, క్రైం, రిజర్వ్ పోలీసులు పర్యవేక్షిస్తారన్నారు. నగర ప్రజలు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

నగరంలోని రౌడీషీటర్లపై, గంజాయి తరలింపు కేసులపై ప్రత్యేక నిఘా పెట్టామని డీసీపీ-1 శ్రీనివాసరావు తెలిపారు. పాత కేసుల్లో ఉన్న వారి వివరాలు సేకరించామని, వారి రోజు వారి విధానాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నగరంలో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. డీసీపీ శ్రీనివాసరావు, ద్వారకా ఏసీపీ మూర్తి, ద్వారకా ఇన్‌చార్జి సీఐ భాస్కరరావు, ఎస్ఐ అప్పలరాజు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు


నిత్యకల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను వైభవంగా జరిపించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేణపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

మత్స్యకారులకు రాయితీపై ఇంజన్లు, బోట్లు

జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు


సహకార సంఘాల అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న గురునాథరావు

నక్కపల్లి: మత్స్యకారులకు జగనన్న ప్రభుత్వం రాయితీపై ఇంజన్లు, బోట్లు సరఫరా చేస్తోందని ఆఫ్కాఫ్ వైస్ చైర్మన్, జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలోని మత్స్యకార సొసైటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 లక్షలు విలువైన యంత్ర పరికరాలను సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. జిల్లాకు వంద యూనిట్లు మంజూరు కాగా, ప్రభుత్వం 75 శాతం రాయితీ ఇస్తోందని, మిగిలిన 25 శాతం లబ్ధిదారుడు వాటాగా చెల్లించాలన్నారు. రిజర్వాయర్లలో వేటసాగించే మత్స్యకారులకు రాయితీపై తెప్పలు అందజేస్తున్నామన్నారు. వేట నిషేధ సమయంలో రూ.10 వేల సాయాన్ని అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో పరిహారం కోసం నెలల తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. పచ్చచొక్కాలు తొడిగిన వారికే పరిహారం ఇచ్చేవారని, సగం మందికి వచ్చేది కాదన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఆ సమస్య లేదన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లి ప్రమాదవ శాత్తూ మరణిస్తే రూ.10 లక్షల పరిహారం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ రూ.24 కోట్లతో ఫిష్‌ల్యాండింగ్ సెంటరు, మిని జెట్టీ నిర్మాణ పనులు నక్కపల్లి మండలంలో త్వరలో ప్రారంభమవుతాయన్నారు. జెట్టీ నిర్మాణం పూర్తయితే ఇక్కడ మత్స్య సంపదను మార్కెటింగ్ చేసుకోవడంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

విశాఖ ఉక్కుపై దేశ ప్రజలందరికీ హక్కు

- ఐక్య పోరాటాలతో కర్మాగారాన్ని కాపాడుకోవాలి
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి


ఉక్కు దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

కూర్మన్నపాలెం: జాతీయ సంపదైన విశాఖ ఉక్కు దేశ ప్రజలందరి హక్కు అని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ఎందరో మహనీయుల త్యాగాలతో సాధించుకున్న అటువంటి పరిశ్రమను ఐక్య పోరాటాలతోనే కాపాడుకోగలమన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే దీక్ష శిబిరాన్ని 966వ రోజు గురువారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.

పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రుణమాఫీ

సీతారాం ఏచూరి మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత 9 ఏళ్లలో పెట్టుబడిదారులకు మోదీ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిందన్నారు. ఉక్కు కర్మాగారానికి ఉన్న అప్పులు చాలా తక్కువ అని, వాటిని రుణమాఫీ చేయాలంటే మోదీకి సులువైన పని అన్నారు. కానీ అలా చేయకుండా ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయడం అన్యాయమన్నారు. ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు చేస్తున్న పోరాటాలను కేంద్ర ప్రభుత్వం విచ్ఛిన్నం చేయాలని చూస్తోందని, ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమను కార్మికుల ఐక్య పోరాటాలతో కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు

గాజువాక: టెక్ మహీంద్ర ఫౌండేషన్, భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ట్రస్ట్ కార్యదర్శి శ్రీరామ్మూర్తి తెలిపారు. బీటెక్, డిప్లమా, ఐటీఐ అర్హతతో 18 నుంచి 29 ఏళ్ల వయస్సుగల యువతీ యువకులకు మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలలో మూడు నెలలపాటు ఇండస్ట్రియల్ ఓరియెంటెడ్ శిక్షణను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. శిక్షణతో పాటు సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్స్‌లో ప్రాథమిక విజ్ఞానాన్ని నేర్పించి ఉపాధి కల్పిస్తామని తెలియజేశారు. పూర్తి వివరాల కోసం 63099 56385, 98668 94969 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ముత్యాలమ్మపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


ముత్యాలమ్మపాలెంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పరవాడ: కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తొలుత ముత్యమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నవరత్న పథకాలతో పేదలకు అండగా నిలిచారని చెప్పారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఒక్క రూపాయి లంచం తీసుకోకుండా ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. తీర ప్రాంతంలో నివాసం ఉంటున్న 327 మంది మత్స్యకారులకు తిక్కవానిపాలెంలో ఇళ్ల స్థలాలు కేటాయించి శాశ్వత నివాసం కల్పించామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా కోటి రూపాయలతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గ్రామంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన తరువాతే తాను మళ్లీ ఓటు అడగడానికి వస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలందరు ఆశీర్వదించి మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఓ మహిళ అనే గౌవరం లేకుండా మంత్రి రోజాను మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అసభ్య పదజాలంతో దూషించడం సభ్యసమాజానికే సిగ్గుగా ఉందన్నారు. ఇటువంటి నాయకులకు వచ్చే ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పాలని బొడ్డేడ ప్రసాద్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత, పార్టీ సీనియర్ నాయకుడు బొంది అచ్చిబాబు, పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, మండల జేసీఎస్ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దసరాలోగా బోనస్ చెల్లింపునకు వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు దసరా పూజలోగా బోనస్ చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. నాయకులు గురువారం స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గత ఆర్థిక సంవత్సరంలో కార్మికులు అకుంఠిత కృషితో రూ. 22,729 కోట్లు టర్నోవర్ సాధించడం జరిగిందన్నారు. దానికి గాను కార్మికులకు రూ. 60 వేలు బోనస్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కొమ్ము ప్రసాద్, బీఎంకె నాయక్, పి.వి.నగేష్, ఎస్.ఎ.నాయుడు, గోపాలరాజు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


అవినీతి రహిత సమాజానికి కృషి

మద్దిలపాలెం: అవినీతి రహిత సమాజానికి విద్యార్థులు కృషి చేయాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ కోరారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా గురువారం కళాశాలలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అవినీతి ఎండకడతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జయ మాట్లాడుతూ ఏ రంగంలో అవినీతి జరుగుతున్నా బయటపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఉమామహేశ్వరరావు, డెమిట్ రాజ్, ప్రతాప్, లక్ష్మి పాల్గొన్నారు.

సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణకు కృషి

భీమునిపట్నం: భీమిలిలోని సీబీసీఎన్‌సీ ఆస్తులను పరిరక్షించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు స్థానిక ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి కమిటీ కార్యదర్శి ప్రేమానందరావు తెలిపారు. గురువారం చర్చిలో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటి నుంచో ఉన్న సీబీసీఎన్‌సీ మిషనరీ సంస్థ పురాతన ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిని నిర్మించిందని తెలిపారు. ఆ సంస్థ ఆస్తులు ఆక్రమణలకు గురవుతున్నాయని, కొన్నింటిని ప్రైవేటు వ్యక్తులు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ ఆస్తుల పరిరక్షణకు జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. చర్చి కమిటీ మాజీ అధ్యక్షుడు కె.ఎస్.ఎం.సుధాకర్, జాయింట్ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు ఘన నివాళి


స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జానకీరామ్ తదితరులు

మహారాణిపేట: భారత వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యుశాస్త్ర నిపుణుడు పద్మ విభూషణ్ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు ఏపీ మెకనైజెడ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఘన నివాళులు అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 1960 సంవత్సరంలో భారతదేశంలో వచ్చినటువంటి ఆహార సంక్షోభంలో తినడానికి తిండిలేక వేలాది మంది చనిపోయిన సందర్భంలో స్వామినాథన్ ఐఏఎస్‌లో ఉత్తీర్ణత సాధించినా ప్రజల కోసం వ్యవసాయ శాస్త్రవేత్తగా అనేక ప్రయోగాలు చేశారన్నారు. స్వయంగా ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించి వ్యవసాయంలో నూతన అధ్యయనానికి నాంది పలికారన్నారు. వేటకు వెళ్లే సమయంలో మత్స్యకారులకు సముద్రంలో జరిగే వాతావరణ మార్పులు, ప్రమాదాలను, తుపానులను ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు మత్స్యకారులకు మొబైల్ ఫోన్లకు సమాచారం అందించే విధంగా ఎమ్మెస్ స్వామినాథన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవస్థ అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు దూడపోలయ్య, గుంటు దానయ్య, సిఐఐ న్యూఢిల్లీ ప్రతినిధులు హర్షవర్ధన్ అమిత్, ఆఫ్ కాఫ్ హార్బర్ మేనేజర్ గోవిందరావు, కాకి శ్రీనివాస్, బడే ఎల్లాజీ. గనగళ్ల పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

కొమ్మాది: ఓ నాయకుడి కారణంగా తమకు అన్యాయం జరుగుతోందని గాజువాకకు చెందిన రోజారమణి కుటుంబ సభ్యులు బీచ్‌రోడ్డులో గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రోజారమణి మాట్లాడుతూ... తన తల్లి 2015లో చనిపోగా, 2017లో తండ్రి మరలా పెళ్లి చేసుకున్నారని... చనిపోయిన తమ తల్లి పేరుతో పినతల్లి ఆధార్‌కార్డు సృష్టించుకుని స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై స్టీల్‌ప్లాంట్, గాజువాక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే తిమ్మాపురం ప్రాంతానికి చెందిన మారుపిల్లి అమర్‌నాథ్ రాజకీయ పలుకుబడితో పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్నాడని రోజారమణి ఆరోపించారు. తిరిగి తమపైనే కేసులు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అమర్‌నాథ్ వద్ద ప్రస్తావించగా ఆందోళన చేస్తున్న వారితో తనకు సంబంధం లేదన్నారు.

మూట్ కోర్టు పోటీలు ప్రారంభం

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి మూట్‌కోర్టు పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. గీతం మూట్, అడ్డకసీ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 8 వరకు గీతం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంవీవీఎస్ మూర్తి పేరుతో పోటీలను వర్చువల్ విధానంలో ప్రముఖ న్యాయ నిపుణుల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. పోటీలను గీతం ప్రో వీసీ గౌతమ్‌రావు ప్రారంభించారు.